
సాక్షి
విజయనగరం

బుధవారం, 19, జూన్, 2024



జీవిత కాల వ్యాధి

సికిల్ సెల్ ఎనీమియా జీవితకాల వ్యాధి. వ్యాధి బారిన పడినవారికి రక్తం తగ్గిపోయి తీవ్ర రక్తహీనతకు గురవుతారు. - 8లో



నీ వెంటే నేను.. - 8లో

నాతిచరామి అని దైవసాక్షిగా పెళ్లినాట చేసిన ప్రమాణానికి ఆ దంపతులు కట్టుబడ్డారు. జీవితాంతం కష్టసుఖాల్లో తోడూ నీడగా మసలుకున్న ఆ పుణ్యదంపతులు చివరి మజిలీ కూడా కలిసే చేశారు.



ట్రావెల్స్ బస్సు, బొలెరో ఢీ: ఒకరి మృతి - 8లో

పూసపాటిరేగ మండలం పాతకొప్పెర్ల వద్ద జాతీయరహదారిపై బొలెరో వాహనాన్ని ట్రావెల్స్ బస్సు ఢీకొంది. ఒకరు మృతిచెందారు.

న్యూస్‌రీల్

పీజీ ఈసెట్‌లో విద్యార్థి ప్రతిభ



తరుణ్

భోగాపురం: భోగాపురం మండలం లింగాలవలస గ్రామానికి చెందిన సీహెచ్ తరుణ్ పీజీ ఎంట్రన్స్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో పదవ ర్యాంకు సాధించాడు. బీఫార్మసీ నాలుగవ సంవత్సరం చదువుతున్న తరుణ్ ఎంఫార్మసీలో ప్రవేశానికి మంచి ర్యాంకు సాధించడంతో కుటుంబ సభ్యులు అభినందించారు.

24 నుంచి 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ'

విజయనగరం అర్బన్: కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి బదులుగా కొత్త ప్రభుత్వం ఆధ్వర్యంలో 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ'ను ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. ఈ నెల 24 నుంచి ప్రతి సోమవారం ఉదయం 10.30 గంటలకు నుంచి ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని చెప్పారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో ఐదో స్థానం

విజయనగరం అర్బన్: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. జిల్లాకు జనరల్ విభాగంలో ఐదవ స్థానం, ఒకేషనల్ విభాగంలో 10వ స్థానం లభించింది. జనరల్ విభాగంలో 6,685 మంది పరీక్ష రాయగా 68 శాతంతో 4,570 మంది ఉత్తీర్ణులయ్యారు. ఒకేషనల్ కోర్సులలో 907 మంది పరీక్ష రాయగా 59.32 శాతంతో 499 మంది ఉత్తీర్ణలయ్యారని ఐఆర్ఓ మజ్జి ఆదినారాయణ తెలిపారు.

తెర్లాం ఎంఎల్ఎస్ పాయింట్ తనిఖీ



తెర్లాం ఎంఎల్ఎస్ పాయింట్‌లో తూనిక యంత్రాన్ని తనిఖీ చేస్తున్న ఆర్డీఓ సాయిశ్రీ

తెర్లాం: తెర్లాం పౌర సరఫరాల గోదాము(ఎంఎల్ఎస్)ను బొబ్బిలి ఆర్డీఓ సాయిశ్రీ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోదాములో ఉన్న సరుకు నిల్వలు, స్టాక్ రికార్డులో ఉన్న నిల్వల వివరాలను పరిశీలించారు. బియ్యం, పంచదార, కందిపప్పు, ఇతర సరుకుల నిల్వల వివరాలను సిబ్బందిని అడిగితెలుసుకున్నారు. సక్రమంగా తూకం వేసి సరుకులు సరఫరా చేయాలని ఆదేశించారు. తూనిక యంత్రం పనితీరును పరీక్షించారు. తనిఖీలో డీఎస్ఓ, తహసీల్దార్ రాజ్యలక్ష్మి, సీఎస్‌డీటీ స్వర్ణలత, ఏపీఎస్‌సీఎస్‌సీఎల్ టెక్నికల్ అసిస్టెంట్ ఎం.ఆమోసు, లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఐటీఐ ప్రవేశాలకు కౌన్సెలింగ్



ప్రభుత్వ ఐటీఐ, విజయనగరం

విజయనగరం రూరల్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు శిక్షణ సంస్థల్లో (ఐటీఐ) ప్రవేశాలకు బుధవారం నుంచి ఈ నెల 26వ తేదీ వరకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు విజయనగరం ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ టీవీ గిరి బుధవారం తెలిపారు. కౌన్సెలింగ్ ఉదయం 8 గంటలకు ప్రారంభమై సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుందన్నారు. ఆన్‌లైన్‌లో 2,155 దరఖాస్తులు రాగా 1628 పరిశీలించామన్నారు. జిల్లాలోని 3 ప్రభుత్వ ఐటీఐలలో వివిధ ట్రేడ్లలో 652 సీట్లు, 25 ప్రైవేటు ఐటీఐలలో 4004 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు.

ర్యాంకుల వారీగా కౌన్సెలింగ్ నిర్వహణ ఇలా...

తేదీ	ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు	మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు
19	01-105	106-259
20	260-396	397-557
21	558-717	718-868
22	869-1036	1037-1239
24	1240-1419	1420-1628
25, 26న జనరల్ పూల్‌లో అన్ని కేటగిరీలకు..		

● స్వీపర్లుగా మారిన విద్యార్థినులు



తరగతి గదులు పరిశుభ్రం తర్వాత స్టిక్‌ను పిండుతున్న బాలికలు



ఇల్లు ఒత్తే స్టిక్‌లను ఆరబెట్టేందుకు తీసుకెళ్తున్న విద్యార్థినులు

చిత్రాల్లో కనిపిస్తున్నది రామభద్రపురం ఉన్నత పాఠశాల విద్యార్థినులు. ఇదేంటి పుస్తకాలు ఉండాల్సిన చేతిలో ఇల్లు ఒత్తే స్కిక్‌లు ఉన్నాయని ఆశ్చర్యపోతున్నారా.. గత ప్రభుత్వంలో స్కావెంజర్లు చేసిన పరిశుభ్రత పనులను ఇప్పుడు విద్యార్థినులు చేయడాన్ని చూసిన తల్లిదండ్రులు అవాక్కయ్యారు. చదువుకోసం పిల్లలను పంపిస్తే గదులను ఊడ్పిస్తారా అంటూ పలువురు ఉపాధ్యాయులను నిలదీశారు కూడా. సోమవారం కురిసిన భారీ వర్షానికి తరగతి గదుల్లోకి నీరుచేరి అపరిశుభ్రంగా మారాయి. ఇక్కడ ఉపాధ్యాయులు ఒక్కో విద్యార్థిని చేతిలో ఇల్లు ఒత్తే స్టిక్‌పెట్టి గదులు ఒత్తించారు. అనంతరం వాటిని ఎండలో ఆరబెట్టించారు. అదే సమయంలో పాఠశాలలో పిల్లలను చేర్పించేందుకు వచ్చిన తల్లిదండ్రులు బాలికలు చేస్తున్న పనులు చూసి ముక్కునవేలేసుకున్నారు. పిల్లలను చదువుకు పంపిస్తే తరగతి గదులు శుభ్రం చేయిస్తున్నారా? టీచర్స్ పిల్లలైతే ఇలాగే చేయిస్తారా అంటూ నిలదీశారు. దీనిపై హెచ్ఎం కామేశ్వరరావు స్పందిస్తూ వరుసగా రెండు రోజులు సెలవులు కావడం, వర్షాలు కురవడంతో తరగతి గదుల్లోకి నీరు వచ్చేసిందని, ఇద్దరు స్కావెంజర్లు శుభ్రం చేస్తున్నారని, ఆఖరులో పిల్లలతో చేయించినట్లున్నారని, బాలికలతో పరిశుభ్రత పనులు చేయించకుండా జాగ్రత్త చర్యలు తీసుకుంటామని సెలవిచ్చారు. – రామభద్రపురం

బొద్దాంలో టీడీపీ కార్యకర్తల వీరంగం

- వైఎస్సార్‌సీపీ కో ఆర్డినేటర్‌పై దాడి
- బిక్కుబిక్కుమంటున్న గ్రామస్తులు



టీడీపీ కార్యకర్తల దాడిలో గాయపడిన వీరస్వామి

రాజాం: మండలంలో బొద్దాం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు రెచ్చిపోయారు. వైఎస్సార్‌సీపీ సోషల్‌మీడియా కోఆర్డినేటర్ అగిరెడు వీరస్వామిపై మంగళవారం దాడికి దిగారు. రోడ్డు నుంచి ఇంటికి వెళ్తున్న వీరస్వామి చొక్కా చించివేసి కర్రలతో గాయపరిచారు. దీంతో ఆయన తలతో పాటు కుడికాలికి తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు వెంటనే ప్రాథమిక చికిత్స నిమిత్తం రాజాంలో ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఉదయం నుంచే గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు కవ్వింపు చర్యలకు దిగారు. నాలుగునెలల కిందట జల్‌జీవన్ మిషన్ కుళాయిల ప్రారంభం నాడు వేసిన శిలాఫలకాన్ని పగులగొట్టారు. సోషల్ మీడియాతో పాటు పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా ఉన్న తనను టార్గెట్‌చేసి, టీడీపీకి చెందిన గుండ పెంటన్నాయుడు, బట్న బాలకృష్ణ, మద్దు ప్రసాద్ తదితరులు హత్యాప్రయత్నం చేసినట్టు రాజాం పోలీసులకు వీరస్వామి ఫిర్యాదు చేశారు.

దాడులు పిరికిపంద చర్య

గెలిచిన పార్టీ ప్రజాభిమానాన్ని పొందేందుకు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలే తప్ప ఇలా దాడులకు బరితెగించడం సబబుకాదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజాం ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్ అన్నారు. వీరస్వామిపై దాడిని తీవ్రంగా ఖండించారు. బాధితుడిని పరామర్శించి వివరాలు సేకరించడంతో పాటు దాడికి పాల్పడిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

అమ్మా నేను బడికి పోతా



నెల్లిమర్ల మండలం సతివాడలో పిల్లల్ని చేర్పించే పనిలో గ్రామ కమిటీతోపాటు సమగ్రశిక్ష జిల్లా, మండల స్థాయి అధికారులు (ఫైల్)

- నెలరోజుల పాటు స్కూళ్లలో చేర్పించేందుకు స్పెషల్ డ్రైవ్
- ఇంటింటి సందర్శనలో ఉపాధ్యాయులు
- గ్రామ, మండల, జిల్లా స్థాయిలో కమిటీలు

విజయనగరం అర్బన్: బడిఈడు పిల్లలంతా బడిలోనే ఉండాలనే లక్ష్యంతో విద్యాశాఖ 'నేను బడికి పోతా' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ నెల 13 నుంచి కార్యక్రమం సాగుతోంది. నెలరోజుల పాటు సాగే ఈ స్పెషల్ డ్రైవ్‌లో గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల సహకారంతో ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి బడిఈడు పిల్లలను గుర్తిస్తున్నారు. బడిలో చేరేలా పిల్లలను ఒప్పిస్తున్నారు. వారితోనే అమ్మా.. నేను బడికి పోతా అని చెప్పిస్తున్నారు. పిల్లలు చదువుకుంటే కలిగే ప్రయోజనాలను తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. బడి ఉత్సవం, బాలికా ఉత్సవం, ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల దినోత్సవం, విద్యా సదస్సు ప్రవర్తన ఇలా ఒక్కో రోజు ఒక అంశంగా తీసుకొని పిల్లలను చేర్పించే ప్రక్రియ చేపట్టారు. దీనికోసం గ్రామ, మండల, జిల్లా స్థాయి కమిటీలు చురుగ్గా పనిచేస్తున్నాయి.

- ఈ స్పెల్ డ్రైవ్‌లో గ్రామ కమిటీలో పేరెంట్ కమిటీ చైర్మన్‌గా ఉన్న వ్యక్తి చైర్మన్‌గా పనిచేస్తారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మెంబర్ కన్వీనర్‌గా, పంచాయతీ కార్యదర్శి, సీఆర్‌పీ, వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్, గ్రామ వలంటీరు, అంగన్‌వాడీ ఉద్యోగి సభ్యులుగా ఉంటారు.
- మండల కమిటీల్లో మండల విద్యాశాఖ అధికారి మెంబర్ కన్వీనర్, ఎంపీడీఓ చైర్మన్‌గా, తహశీల్దార్, ఐసీడీఎస్ సీడీపీఓ, సాంఘిక, గిరిజన సంక్షేమశాఖ అధికారులు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు, కేజీబీవీ ప్రిన్సిపాల్, డీఎల్ఎంటీలు సభ్యులుగా వ్యవహరించనున్నారు.
- జిల్లా కమిటీలో జిల్లా విద్యాశాఖ అధికారి జిల్లా కమిటీ చైర్మన్‌గా, సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ (ఏపీసీ) మెంబర్ కన్వీనర్‌గా, డీపీఓ, లేబర్‌శాఖ డీసీ, ఐటీడీఏ పీఓ, ఐసీడీఎస్ పీఓ, లైబ్రరీ, సోషల్, బీసీ, మైనార్టీ, వెల్ఫేర్ డీడీలు, ఎన్‌సీఎల్‌పీ డీడీ, మెప్మా పీడీ, డీవైఈఓ సభ్యులుగా ఉంటారు.

బడికి దూరం కాకూడదనే...

జిల్లాలోని బడి ఈడు పిల్లవెవరూ బడికి దూరంగా ఉండకూడదనే లక్ష్యంతో 'నేను బడికి పోతా..' కార్యక్రమాన్ని చేపట్టాం. నెల రోజుల పాటు చేపట్టనున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రత్యేక కమిటీలను నియమించాం. అందరూ స్పెషల్ డ్రైవ్‌లో భాగస్వాములవుతారు. బడిఈడు పిల్లలను గుర్తించి బడుల్లో చేర్పిస్తారు.

– ఎస్.ప్రేమకుమార్, డీఈఓ

ఒక్కో రోజు 20 నుంచి 30 ఇళ్ల సందర్శన

జిల్లాలోని 27 మండలాల పరిధిలోని గ్రామాల్లో గ్రామ కమిటీల పర్యవేక్షణలో ఇంటింటి సందర్శన చేపడుతున్నారు. ఆ పాఠశాల పరిధిలోని గ్రామాల్లో రోజుకు కనీసం 20 నుంచి 30 ఇళ్లను సందర్శించేలా కమిటీలు ప్రణాళిక రూపొందించాయి. ముందుగా దృష్టిలోపం, చెవుడు, మూగ తదితర ప్రత్యేక సమస్యల కారణంగా డ్రాప్ అవుట్ అవుతున్న పిల్లల ఇళ్లకు వెళ్లి నచ్చజెబుతున్నారు. తల్లిదండ్రులను ఒప్పించి తిరిగి పాఠశాలలో చేర్పిస్తున్నారు.

కలెక్టరేట్ వద్ద జిందాల్ కార్మికుల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న జిందాల్ కార్మికులు

- అక్రమ లాకౌట్ ఎత్తేయాలని కార్మిక సంఘాల జేఏసీ డిమాండ్



మాట్లాడుతున్న వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ గౌరవాధ్యక్షుడు నెక్కలి నాయుడుబాబు

విజయనగరం అర్బన్: కొత్తవలసలోని జిందాల్ స్టెయిన్‌లెస్ స్టీల్ లిమిటెడ్ కంపెనీ మే 17న విధించిన అక్రమ లాకౌట్‌ను వెంటనే ఎత్తివేయాలని జిందాల్ ఎంప్లాయీస్ అండ్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం జేఏసీ కమిటీ ఆధ్వర్యంలో విజయనగరం కలెక్టరేట్ ఎదుట కార్మికులు ధర్నా చేశారు. జేఏసీలోని వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ గౌరవాధ్యక్షుడు నెక్కలి నాయుడుబాబు మాట్లాడుతూ ముందస్తు నోటీస్ ఇవ్వకుండా అర్ధంతరంగా కర్మాగారం మూసివేడం అన్యాయమన్నారు. 321 మందికి పైగా కార్మికులు పనిచేస్తున్న ఏ కంపెనీ అయినా లాకౌట్ విధించాలంటే రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఉండాలన్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా లాకౌట్ విధించడం చట్ట వ్యతిరేకమన్నారు. కర్మాగారాన్ని పునఃప్రారంభించే వరకు కార్మికులకు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. 33 రోజులకు పైగా ఆందోళన కొనసాగిస్తున్న కార్మికుల సమస్యను పరిష్కరించని యాజమాన్యంపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ మాట్లాడుతూ కర్మాగారంలో శాశ్వత ప్రాతిపదికన 57 మంది, 264 మంది కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారని, జిల్లా ఉన్నతాధికారులు స్పందించి కర్మాగారం తెరిపించి ఉపాధి కల్పించేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల ప్రతినిధులు టి.వి.రమణ, ఎం.శ్రీనివాస్, జి.అప్పారావు, యూనియన్ నాయకులు చిన్నబాబు, బి.ఈశ్వరరావు, రాము, వైఎస్సాటీయూ నాయకులు వామాలు, ఎ.ఆర్.నాయుడు, సర్పంచ్‌లు కోన దేముడు, గణేష్, టీఎస్‌టీయూ పి.అప్పలరాజు, భీమయ్యనాయుడు, కార్మికులు పాల్గొన్నారు.

జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన జిల్లా నాయకులు



జగన్‌మోహన్‌రెడ్డితో జిల్లా నాయకులు

విజయనగరం: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని జిల్లాకు చెందిన పలువురు నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని జగన్మోహన్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో కలిసి ఎన్నికల నేపథ్యంలో జరిగిన పరిణామాలు, ఇతర విషయాలపై చర్చించారు. ప్రజాక్షేత్రంలో గెలుపోటములు సర్వసాధారణమని, వైఎస్సార్‌సీపీ బలోపేతానికి నేతలంతా కలిసికట్టుగా కృషి చేయాలని జగన్‌మోహన్‌రెడ్డి దిశానిర్దేశం చేసినట్టు జిల్లా నాయకులు స్థానిక విలేకరులకు తెలిపారు. జగన్‌మోహన్ రెడ్డిని కలిసిన వారిలో మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యేలు బొత్స అప్పలనరసయ్య, బడ్డుకొండ అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు సంగంరెడ్డి బంగారు నాయుడు, నెల్లిమర్ల మండల నాయకులు అంబళ్ల శ్రీరాములు నాయుడు, ఎం.కె.బి.శ్రీను తదితరులు ఉన్నారు.

● పెద్దమ్మ తల్లీ కరుణించమ్మా...



భామిని: మృగశిర కార్తె దాటింది.. ఆరుద్ర కార్తె సమీపిస్తున్నది. వర్షాల జాడలేదు. వరి నారు పోతలు సాగలేదు. పెద్దమ్మ తల్లీ కరుణించమ్మా.. వర్షాలు కురిపించమ్మా అంటూ భామిని రైతులు, గ్రామస్తులు సామూహికంగా మంగళవారం గ్రామదేవత సంబరాలను నిర్వహించారు. మహిళలు ముర్రాటలను ఊరేగింపుగా తీసుకెళ్లి గ్రామదేవతకు చల్లదనం చేశారు. మొక్కుబడులు చెల్లించారు.

పారాది వంతెనను వెంటనే పునరుద్ధరించాలి

- గ్రామాల్లో తాగునీటి సరఫరాపై దృష్టి పెట్టండి
- ఎంఎన్ చానల్ ద్వారా గజపతినగరానికి సాగునీరు
- రాష్ట్ర చిన్న పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్



మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం అర్బన్:

విజయనగరం నుంచి మన్యం జిల్లాతో పాటు ఒడిశా రాష్ట్రాన్ని అనుసంధానించే అంతర్రాష్ట్ర రహదారిపై ఉన్న పారాది వంతెనను వెంటనే పునరుద్ధరించాలని రాష్ట్ర చిన్న పరిశ్రమలు, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులకు సూచించారు. ప్రస్తుతం వాహనాల రాకపోకలకు వీలుగా వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. తాత్కాలికంగా కాజ్‌వేను నిర్మించాలన్నారు. పంచాయతీరాజ్, నీటిపారుదల, ఆర్అండ్‌బీ, గ్రామీణ నీటి సరఫరా, గృహనిర్మాణం తదితర శాఖల ఇంజినీరింగ్ అధికారులతో జెడ్పీ అతిథిగృహంలో మంత్రి శ్రీనివాస్ మంగళవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఆయా శాఖల కార్యకలాపాలు, ప్రస్తుత ప్రాజెక్టుల స్థితిగతులను తెలుసుకున్నారు.

జిల్లాలో ముఖ్యంగా రహదారులు, వాటి స్థితిగతులను మంత్రి ఆరా తీశారు. చిన్నచిన్న కారణాలతో బిల్లులు చెల్లించక పెండింగ్‌లో ఉండిపోయిన రహదారుల గురించి ఆర్అండ్‌బీ ఈఈ జేమ్స్‌ను ప్రశ్నించారు. చేపట్టాల్సిన తక్షణ చర్యలపై సమీక్షించి వాటికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. జిల్లాలోని ప్రాజెక్టుల పరిస్థితి, వీటి లభ్యత గురించి నీటిపారుదల శాఖ సమీక్షలో మంత్రి తెలుసుకున్నారు. చిన్న, మధ్యతరహా, భారీ ప్రాజెక్టుల్లో ప్రస్తుత నీటి పరిస్థితి, ప్రాజెక్టుల పెండింగ్ పనుల గురించి నార్త్ కోస్టల్ సీఈ శంబంగి సుగుణాకర రావు, ఈఈ అప్పలనాయుడు మంత్రికి వివరించారు. ప్రస్తుతం తోటపల్లిలో నీటి లభ్యత సంతృప్తికరంగా ఉందని, ఆంధ్ర ప్రాజెక్టులో డెడ్ స్టోరేజీకి చేరుకుందని వారు తెలిపారు. తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టు పూర్తయితే, భోగాపురం విమానాశ్రయానికి నీటి అవసరాలు తీరుతాయని చెప్పారు. తోటపల్లి రిజర్వాయర్ నుంచి సాగునీటిని విడుదల చేసేటప్పుడు తమతో పాటు సంబంధిత శాసన సభ్యులకు సమాచారాన్ని ఇవ్వాలని మంత్రి సూచించారు. గజపతినగరానికి ఆంధ్ర రిజర్వాయర్ నుంచి ఎంఎస్ చానల్, కొణిశ చానల్ ద్వారా సాగునీరు అందించేందుకు అవసరమైన ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. గ్రామాల్లో ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా అన్ని రకాల చర్యలూ తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఉమాశంకర్‌ను కోరారు. గ్రామాల్లో తాగునీటి లభ్యత, ప్రస్తుత సరఫరా, జల్‌జీవన్ మిషన్ పనుల గురించి సమీక్షించారు. జిల్లాలోని చిన్న, భారీ రక్షిత నీటి సరఫరా పథకాలు, వాటి నిర్వహణ, బోరు బావులు, వాటి పరిస్థితి, జేజేఎం పనుల గురించి ఎస్ఈ వివరించారు. గ్రామం వారీగా తాగునీటి పరిస్థితిపై తమకు సమగ్ర నివేదికను అందజేయాలని సూచించారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ ద్వారా ప్రస్తుతం జరుగుతున్న పనులు, వాటి పరిస్థితి గురించి ఎస్ఈ విఎస్ఎస్‌మూర్తి వివరించారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న కాలనీలు, ఇళ్లు, వాటి స్థితిగతులను తెలియజేశారు. ఎన్టీఆర్ హౌసింగ్ స్కీమ్ పెండింగ్ బిల్లుల గురించి మంత్రి ఆరా తీశారు.



హాజరైన వివిధ శాఖల జిల్లా అధికారులు

క్లుప్తంగా

21న మెగా జాబ్ మేళా

విజయనగరం రూరల్: నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి కల్పనలో భాగంగా ఈ నెల 21న విజయనగరంలోని ఎంఆర్ కళాశాల వద్ద మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారిణి డి.అరుణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అపోలో టైర్స్, మోడలేజ్ ఇండియా ఫుడ్ ప్రైవేట్ లిమిటెడ్, పాపులర్ షూ మార్టులలో 240 ఉద్యోగాల భర్తీకి జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఎంప్లాయిమెంట్ వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకుని, బయోడేటా, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, ఒరిజనల్ ధ్రువీకరణపత్రాలు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో ఉదయం 10 గంటలకు హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ 8919179415 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

సెంచూరియన్‌ను సందర్శించిన ఆస్ట్రేలియా ప్రతినిధి


రెబెక్కకు వివరిస్తున్న వీసీ ప్రశాంత కుమార్ మహంతి

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలిలో గల సెంచూరియన్ విశ్వ విద్యాలయాన్ని ఆస్ట్రేలియా ప్రతినిధి రెబెక్క మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా వర్సిటీలో అమలు చేస్తున్న సేంద్రీయ వ్యవసాయం గురించి అడిగి తెలుసుకున్నారు. ఆమెకు విశ్వ విద్యాలయం వీసీ చాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి ఇక్కడ అమలు చేస్తున్న కోర్సులు, సదుపాయాల గురించి వివరించారు. కార్యక్రమంలో డీన్ సన్నీ డియోల్, రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, డిప్యూటీ రిజిస్ట్రార్ వర్మ, తదితరులు పాల్గొన్నారు.

నాసిరకం బంగారం విక్రయం

- బాధితుల ఫిర్యాదు


షాపు యజమానిని నిలదీస్తున్న బాధితులు


బొబ్బిలి: పట్టణంలోని సుధా జ్యుయలర్స్ తమకు నాసిరకం బంగారం విక్రయించిందని బాడంగి మండలం గొల్లాదికి చెందిన యామలి అప్పలనాయుడు బంధువులు, బంటు సూరమ్మ ఆరోపించారు. మంగళవారం ఆ దుకాణానికి వచ్చి యజమానిని దీనిపై నిలదీశారు. అయితే తాము విక్రయించి చాలా రోజులైనందున తమకు సంబంధం లేదని షాపు యజమాని చెప్పడంతో వారు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఎస్సై జి లోవరాజుకు ఫిర్యాదు చేశారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల సీజ్


పట్టుకున్న ట్రాక్టర్లతో ఎక్సైజ్ సిబ్బంది

గజపతినగరం రూరల్: ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేశామని ఎక్సైజ్ ఎస్సై మన్మథరావు మంగళవారం తెలిపారు. దీనిపై ఆయన మాట్లాడుతూ స్థానికుల సమాచారం మేరకు మండలంలోని జిన్నాం కూడలిలో రెండు, మరుపల్లి కూడలి వద్ద ఒక ట్రాక్టర్‌ను పట్టుకుని గజపతినగరం పోలీసులకు అప్పగించి సీజ్ చేసినట్లు తెలిపారు. ట్రాక్టర్ల యజమానులను అదుపులోకి తీసుకుని కేసు నమోదుచేశామన్నారు.

గూడ్స్ రైలు నుంచి విడిపోయిన బోగీలు


గూడ్స్ రైలు నుంచి విడిపోయిన బోగీలు

పార్వతీపురం టౌన్: కొమరాడ మండలం సోమినాయుడు వలస రైల్వే గేటు సమీపంలో మంగళవారం గూడ్స్ రైలు నుంచి బోగీలు విడిపోయాయి. ఈ సంఘటనపై పార్వతీపురం రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సాంకేతిక కారణాల వల్ల గూడ్స్ రైలు నుంచి నాలుగు బోగీలు విడిపోగా సిబ్బంది అప్రమత్తమై మరమ్మతులు చేసి విడిపోయిన బోగీలు రైలుకు అతికించారని చెప్పారు. రైళ్ల రాకపోకలకు అంతరాయం లేకుండా చేశామని, ఎటువంటి ఆస్తి, ప్రాణనష్టం జరగలేదన్నారు.


చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹148	₹266	₹276

జీవిత కాల వ్యాధి

- సికిల్‌సెల్ ఎనీమియా సోకితే తీవ్ర రక్తహీనత
- సకాలంలో గుర్తించి చికిత్స చేయించుకోవాలి
- గిరిజన ప్రాంతాల్లో బాధితులు ఎక్కువ


సికిల్ సెల్ ఎనీమియా కణాలు

విజయనగరం ఫోర్ట్: సికిల్ సెల్ ఎనీమియా జీవిత కాల వ్యాధి. వ్యాధి బారిన పడినవారికి రక్తం తగ్గిపోయి తీవ్ర రక్తహీనతకు గురవుతారు. సికిల్ సెల్ ఎనీమియా లక్షణాలు ఉన్న వారు వ్యాధి నిర్ధారణ పరీక్ష చేయించుకుని సకాలంలో చికిత్స తీసుకోవాలి. దీని వల్ల జీవితకాలం పెంచుకోవడానికి ఆస్కారం ఉంటుంది. ఈ వ్యాధి గిరిజన ప్రాంతాల్లో ఎక్కువగా ఉంది. మైదాన ప్రాంతాల్లో కూడా వ్యాధిగ్రస్తులు ఉన్నారు. బుధవారం ప్రపంచ సికిల్ సెల్ ఎనీమియా డే సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

సికిల్ సెల్ ఎనీమియా వారసత్వంగా వచ్చిన ఎర్ర రక్త కణాల రుగ్మతల సముహం. వ్యాధి సోకిన వ్యక్తి రక్తంలో హిమోగ్లోబిన్ ఉత్పత్తికి కారణమయ్యే జన్యువులు లోపభూయిష్టంగా ఉంటాయి. రక్తంలోని హిమోగ్లోబిన్ శరీరంలోని వివిధ భాగాలకు ఆక్సిజన్ తీసుకువెళ్తుంది. సికిల్ సెల్ ఎనీమియా సోకిన వ్యక్తిలో ఉన్న కొడవలి కణాలు ఆక్సిజన్ తీసుకు వెళ్లే సామర్థ్యాన్ని తగ్గిస్తాయి. సంవత్సరాల తరబడి తగినంత మొత్తంలో ఆక్సిజన్ లేక పోవడం వల్ల శరీరంలోని ఏదో ఒక అవయవం దెబ్బతింటుంది. సాధారణ రక్త కణాలతో పోలిస్తే సికిల్ సెల్ (కొడవలి కణాలు) కణాలు దృఢంగా ఉంటాయి. ఇవి రక్త ప్రవాహంలో అడ్డంకులను సృష్టిస్తాయి. సికిల్ సెల్ కణాలు తక్కువ జీవిత కాలాన్ని కల్గి ఉంటాయి. ఇది శరీరంలోని పరిమాణం తగ్గడానికి దారితీస్తుంది. తల్లిదండ్రుల నుంచి లోపభూయిష్ట జన్యువు వచ్చినప్పుడు అది సికిల్ సెల్ ఎనీమియా వ్యాధికి దారితీస్తుంది.

వ్యాధి లక్షణాలు

- రక్త కణాల సంఖ్య తగ్గడంతో రక్తహీనత వస్తుంది.
- కళ్లు పసుపు రంగులోకి మారడం
- తీవ్రమైన ఒళ్లు నొప్పులు, కీళ్ల నొప్పులు
- శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది
- అలసట
- తరచూ వచ్చే అంటువ్యాధులు
- గర్భధారణ సమయంలో సమస్యలు
- శరీరంలో ఏదైనా అవయవం దెబ్బతినడం
- వీపు, కాళ్లు, చాతీ మొదలైన వాటిలో తీవ్రమైన నొప్పిని కల్గి ఉండడం.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- శరీరంలో తగినంత నీటిశాతం ఉండేలా చూడాలి
- వైద్యుల సలహా మేరకు మందులు వాడాలి
- సమతుల్య ఆహారం, పౌష్టికాహారం తీసుకోవాలి
- విపరీతమైన వాతావరణ పరిస్థితుల్లో ఉండకూడదు
- ఆరోగ్యకరమైన జీవన శైలిని అనుసరించాలి
- ఎత్తైన ప్రదేశాలకు వెళ్లకూడదు
- సికిల్ సెల్ ఎనీమియా పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి

సికిల్ సెల్ ఎనీమియాపై అవగాహన కల్పించండి



సికిల్ సెల్ ఎనీమియా గిరిజన ప్రాంతాల్లో ఎక్కువగా కనిపిస్తోంది. ప్రపంచ సికిల్ ఎనీమియా డే సందర్భంగా బుధవారం సికిల్ సెల్ ఎనీమియా గురించి ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నాం. ఈవ్యాధి వ్యాప్తి, చికిత్స విధానం తదితర అంశాల గురించి కరపత్రాల ద్వారా అవగాహన కల్పించనున్నాం.

– డాక్టర్ ఎస్. భాస్కరరావు, డీఎంహెచ్‌ఓ

వ్యాధి వ్యాప్తి

సికిల్ సెల్ ఎనీమియా అంటువ్యాధి కాదు. ఒక వ్యక్తికి నీరు, గాలి, చర్మం మొదలైన వాటి ద్వారా సికిల్ సెల్ ఎనీమియా సోకదు. ఆహారపు అలవాట్ల వల్ల రాదు. జన్యుపరంగా తల్లిదండ్రుల నుంచి మాత్రమే వస్తుంది. సికిల్ సెల్ ఎనీమియా గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. కాని వ్యాధి పట్ల అవగాహన అవసరం. ఈవ్యాధి గిరిజన ప్రాంతాల్లో ఎక్కువగా కనిపిస్తోంది.

నీ వెంటే నేను..

- భర్త మరణం తాళలేక భార్య మృతి
- ఒకరి వెంట ఒకరి పరలోక ప్రయాణం
- కొప్పరవలసలో తీవ్రవిషాదం


బొద్దూరు శ్రీరాములు మృతదేహం


బొద్దూరు చినతల్లి మృతదేహం


శ్రీరాములు (ఫైల్)


చినతల్లి (ఫైల్)

వంగర: నాతిచరామి అని దైవసాక్షిగా పెళ్లినాట చేసిన ప్రమాణానికి ఆ దంపతులు కట్టుబడ్డారు. జీవితాంతం కష్టసుఖాల్లో తోడూనీడగా మసలుకున్న ఆ పుణ్యదంపతులు చివరి మజిలీ కూడా కలిసే చేశారు. భర్త మరణాన్ని తట్టుకోలేకపోయిన ఆ భార్య కొన్ని గంటల వ్యవధిలోనే భర్త వెంటే పరలోకానికి చేరుకుంది. ఈ విషాద ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. వంగర మండల పరిధి కొప్పరవలస గ్రామానికి చెందిన బొద్దూరు శ్రీరాములు(60) అనారోగ్యంతో మృతిచెందగా కొద్ది గంటల వ్యవధిలోనే ఆయన భార్య చినతల్లి(55) కూడా హఠాత్తుగా మంగళవారం మరణించింది. ఈ విషాద ఘటన గ్రామస్తులందరినీ కలిచివేసింది. గ్రామానికి చెందిన బొద్దూరు శ్రీరాములు రజక వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న శ్రీరాములు ఇటీవల విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స కోసం చేరాడు. అక్కడే చికిత్స పొందుతూ ఈ నెల 17వ తేదీన మృతిచెందాడు. ఆయన మృతదేహం సోమవారం రాత్రి గ్రామానికి తీసుకురావడంతో భార్య చినతల్లి బోరున విలపించింది. భర్త లేని విషయాన్ని జీర్ణించుకోలేకపోయి మృతదేహం వద్ద రోదిస్తూ భార్య చినతల్లి మంగళవారం వేకువజామున మృతిచెందింది. ఈ విషాద ఘటన చూసిన వారంతా దిగ్భ్రాంతికి గురయ్యారు. మృతులకు కుమారులు రాము, రామిశెట్టితో పాటు ఒక కుమార్తె ఉన్నారు. తల్లిదండ్రులిద్దరూ ఒకేసారి మరణించడంతో కుటుంబసభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. దంపతుల మృతదేహాలకు గ్రామసమీపంలోని శ్మశానవాటిక వద్ద ఒకేచోట చితిపేర్చి దహనం చేశారు. అంతిమయాత్రలో గ్రామస్తులతో పాటు సమీప గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ట్రావెల్స్ బస్సు, బొలెరో ఢీ: ఒకరి మృతి


ప్రమాదంలో దెబ్బతిన్న బస్సు


నుజ్జునుజ్జయిన బొలెరో వాహనం

- మరొకరికి తీవ్రగాయాలు


నర్సింహమూర్తి మృతదేహం

పూసపాటిరేగ: మండలంలోని పాతకొప్పెర్ల వద్ద జాతీయరహదారిపై మంగళవారం సాయంత్రం బొలెరో వాహనాన్ని ట్రావెల్స్ బస్సు ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. పాతకొప్పెర్ల సమీపంలో జాతీయరహదారిపై టైర్‌పంక్చర్ అవడంతో ఆగి మరమ్మతులు చేసుకుంటున్న బొలెరో వాహనాన్ని పుణ్యక్షేత్రాలకు యాత్రికులతో వెళ్లి తిరిగి వస్తున్న బస్సు వెనుక నుంచి బలంగా ఢీకొంది. దీంతో బొలెరో వాహనానికి మరమ్మతులు చేస్తున్న విశాఖ జిల్లా ఆనందపురం మండలం బొడ్డపాలెం గ్రామానికి చెందిన తోనంగి నరిసింహమూర్తి (35) అక్కడికక్కడే మృతి చెందాడు. అదే గ్రామానికి చెందిన సాడి రమణకు కాలు విరిగిపోవడంతో పాటు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం విజయనగరం జిల్లాకేంద్రాస్పత్రికి తరలించారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం విజయనగరం జిల్లాకేంద్రాస్పత్రికి తరలించారు. ట్రావెల్స్ బస్సులో యాత్రికులు గత 36 రోజులుగా వివిధ రాష్ట్రాల్లో పుణ్యక్షేత్రాలకు వెళ్లి తిరుగు ప్రయాణంలో కొద్ది గంటల్లో స్వగ్రామాలైన శ్రీకాకుళం జిల్లాలోని వివిధ మండలాలకు చేరుకోవాల్సి ఉండగా ప్రమాదం జరిగింది. ట్రావెల్స్ బస్సులో యాత్రికులంతా సురక్షితంగా బయటపడడంతో ఊపిరి పీల్చుకున్నారు. సంఘటన స్థలంలో పూసపాటిరేగ ఎస్సై ఎ.సన్యాసినాయుడు క్రేన్‌తో సహాయక చర్యలు చేపట్టారు. యాత్రికులను స్వగ్రామాలకు వేరే బస్సుల ద్వారా పంపించారు. ఈ ప్రమాద సంఘటనపై పూసపాటిరేగ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


బస్సులో ప్రయాణించిన యాత్రికులు

ఖేలో ఇండియా వెయిట్ లిఫ్టింగ్‌లో నీరజ ప్రతిభ



రజత పతకాన్ని చూపిస్తున్న నీరజ

నెల్లిమర్ల రూరల్: మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ఈ నెల 17 న ప్రారంభమైన అస్మిత ఖేలో ఇండియా ఉమెన్ ర్యాంకింగ్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారిణి ఖాతా తెరిచింది. నెల్లిమర్ల మండలంలోని కొండవెలగాడ గ్రామానికి చెందిన వెయిట్ లిఫ్టర్ బాలి నీరజ మంగళవారం 45 కిలోల కేటగిరీలో పోటీల్లో పాల్గొని స్నాచ్ 56 కిలోలు, క్లీన్ అండ్ జెర్క్ 64 కిలోలు..మొత్తం 120 కిలోల బరువు ఎత్తి రజత పతకాన్ని కైవసం చేసుకుంది. జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చిన నీరజకు రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు లక్ష్మీ దింషా బాబు, వెంకట్రామయ్య, జిల్లా అసోషియేషన్ ప్రతినిధులు నాగలక్ష్మి, చల్లా రాము, తదితరులు అభినందనలు తెలిపారు.

సికిల్ సెల్ ఎనీమియా పోస్టర్ ఆవిష్కరణ


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: సికిల్‌సెల్ ఎనీమియాపై క్షేత్రస్థాయిలో వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్. భాస్కరరావు తెలిపారు. ఈ మేరకు స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం సికిల్‌సెల్ ఎనీమియా వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచ సికిల్ సెల్ ఎనీమియా దినోత్సవం సందర్భంగా బుధవారం జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అవగాహనసదస్సులు నిర్వహించాలని చెప్పారు. రక్త కణాల సంఖ్య తగ్గడం, కళ్లు పసుపు రంగులోకి మారడం, తీవ్రమైన ఒళ్లు నొప్పులు సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి లక్షణాలన్నారు. కార్యక్రమంలో డీఎల్‌ఓ డాక్టర్ కె.రాణి, డీఐఓ డాక్టర్ అచ్యుతకుమారి, ఆర్‌బీఎస్‌కే కో ఆర్డినేటర్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ వెంకటేష్, చంద్రశేఖరరాజు, సత్యరాజ్, అనిల్ ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సమస్యల పరిష్కారానికి కృషి

- రాష్ట్ర గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

విజయనగరం రూరల్: గిరిజన ప్రాంతాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి పేర్కొన్నారు. మంత్రిగా ప్రమాణం స్వీకారం చేసిన అనంతరం తొలిసారిగా జిల్లాకు వచ్చిన ఆమె విజయనగరంలోని అశోక్ బంగ్లాలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లారు. ఈ సందర్భంగా విద్య, వైద్యం, సాగునీరు, తాగునీరు, రోడ్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. అలాగే గిరిజన గర్భిణుల డోలీ కష్టాలు తీర్చి, గిరిజన వసతి గృహం ఏర్పాటు చేసి వైద్య సహాయం అందేలా కృషి చేస్తానన్నారు. పౌష్టికాహారం అందిస్తామని, గిరిజన వసతి గృహాల్లో ఏఎన్‌ఎంల నియామకానికి సంబంధించి తొలి సంతకం చేశానని తెలిపారు. చట్టపరమైన చర్యలే తప్ప కక్ష సాధింపు చర్యలు ఈ ప్రభుత్వంలో ఉండవన్నారు. కార్యక్రమంలో విజయనగరం ఎమ్మెల్యే పి.అదితి గజపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభం కాని ఏకలవ్య స్కూల్స్

- ఆందోళనలో గిరిజన విద్యార్థులు
- విధుల్లో చేరని ఉత్తరాది రాష్ట్రాల ఉపాధ్యాయులు
- ప్రశ్నార్థకంగా మారిన గెస్ట్ ఉపాధ్యాయుల ఉపాధి



పార్వతీపురం ఏకలవ్య మోడల్ స్కూల్

పార్వతీపురంటౌన్: గిరిజన విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దడానికి కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాలలు ఈ విద్యా సంవత్సరంలో ఇంకా తెరుచుకోలేదు. ఏటా జూన్ 12వ తేదీన తరగతులు ప్రారంభమయ్యేవి. కానీ ఈసారి స్కూళ్ల ప్రారంభ తేదీపై ఉపాధ్యాయులు సైతం తమకు ఎలాంటి సమాచారం లేదని చెబుతున్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో రాష్ట్ర ప్రభుత్వ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న ఈ పాఠశాలలు పార్వతీపురం మన్యం జిల్లా వ్యాప్తంగా ఐదు ఉన్నాయి. 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు తరగతులు నిర్వహిస్తుండగా సీబీఎస్‌ఈ సిలబస్‌తో పాటు డిజిటల్ తరగతుల వసతులున్నాయి. ఈ విద్యా సంవత్సరంలో ఏకలవ్య పాఠశాలలు ఇంకా ప్రారంభం కాకపోవడంతో జిల్లా వ్యాప్తంగా ఉన్న సుమారు 2 వేల మంది విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అలాగే 70 మంది స్థానిక గెస్ట్ ఉపాధ్యాయుల ఉపాధి కూడా ప్రశ్నార్థకంగా మారింది. కేంద్ర ప్రభుత్వం ఉత్తరాది రాష్ట్రాల ఉపాధ్యాయులను ఇక్కడ నియమించడమే ఇందుకు కారణమని ఏకలవ్య పాఠశాలల సిబ్బంది చెబుతున్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు సీబీఎస్‌ఈ సిలబస్ ఏప్రిల్ నెలలోనే ప్రారంభం కావాల్సి ఉంది. అయితే పాఠ్య పుస్తకాలు సైతం ఇప్పటికీ పంపిణీ కాలేదు.

'రెగ్యులర్ రిక్రూట్‌మెంట్‌లో 'హిందీ' మెలిక

ఏకలవ్య పాఠశాలల్లో రెగ్యులర్ ఉపాధ్యాయుల నియామకం కోసం గతేడాది డిసెంబర్‌లో కేంద్ర ప్రభుత్వం పరీక్షలు నిర్వహించింది. నాలుగు సబ్జెక్టులకు పరీక్షలు నిర్వహించగా హిందీలో పాస్ మార్కులు వస్తేనే ఇతర సబ్జెక్టుల పేపర్లను కరెక్షన్ చేయాలనే నిబంధనతో తెలుగు వారికి అన్యాయం జరిగిందనే విమర్శలున్నాయి. ఈ నిబంధన వల్ల అత్యధిక సంఖ్యలో ఉత్తరాది రాష్ట్రాల అభ్యర్థులే ఎంపికయ్యారు. అలాగే గతంలో పాఠశాలల ప్రారంభ సమయంలో గెస్ట్ ఉపాధ్యాయులకు క్వాలిఫికేషన్ ఆధారంగా ఇంటర్వ్యూ నిర్వహించి.. డెమో ఇప్పించి నియమించారు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం నిర్ణయంతో తమకు కూడా అన్యాయం జరిగిందని గెస్ట్ ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం


అబుల్‌కలాం మాలిక్ మృతదేహం

పూసపాటిరేగ: మండలంలోని చింతపల్లి బీచ్‌లో గల్లంతైన వ్యక్తి మృతదేహం మంగళవారం ఉదయం లభ్యమైంది. శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలంలో పనిచేస్తున్న 8మంది స్నానానికి చింతపల్లి బీచ్‌కు రాగా వారిలో అబుల్‌కలాం మాలిక్ గల్లంతవడంతో ఫిర్యాదు మేరకు మెరైన్ పోలీసులు, లోకల్ పోలీసులు, రెవెన్యూ అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. ఎట్టకేలకు గల్లంతైన ప్రదేశం నుంచి సుమారు మూడు కిలో మీటర్ల దూరంలో అబ్దుల్ కలాం మాలిక్ మృతదేహం లభ్యమైంది. మాలిక్ స్వస్థలం పశ్చిమబెంగాల్ కావడంతో సమాచారం మేరకు బంధువులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం ఆస్పత్రికి పోలీసులు తరలించారు. ఈ మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్రవాహనంపై ఆవుదాడి

- మహిళకు గాయాలు


గాయాలైన మహిళను 108లో తరలిస్తున్న దృశ్యం

రాజాం సిటీ: మండల పరిధి పెనుబాక గ్రామం వద్ద బైక్‌పై ఆవు దాడిచేసిన ఘటనలో బొద్దాం గ్రామానికి చెందిన సీహెచ్ తులసి గాయాల పాలైంది. మంగళవారం ఆమె తన కుమారుడితో కలిసి ద్విచక్రవాహనంపై రాజాం వస్తోంది. పెనుబాక సమీపంలోకి వచ్చేసరికి ఆవు ఒక్కసారిగా వారిపై దాడిచేయడంతో రోడ్డుపై పడిపోయారు. ఈ ఘటనలో ఆమె తలకు బలమైన గాయాలయ్యాయి. అటు వైపు వెళ్తున్న కొంతమంది స్థానికులు 108కు సమాచారం అందించగా ఈఎంటీ మీసాల ఈశ్వరరావు, పైలెట్ సాయిబాబాలు వచ్చి ప్రథమ చికిత్సచేసి మెరుగైన చికిత్సకోసం ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి వైద్యులు శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. ఈ ఘటనకు సంబంధించి తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

అగ్ని ప్రమాదంలో బోటు దగ్ధం

- సురక్షితంగా బయటపడిన మత్స్యకారులు

భోగాపురం: భోగాపురం: విశాఖపట్నం జిల్లా పూడిమరక గ్రామానికి చెందిన ఏడుగురు మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లి తిరిగి వస్తుండగా బోటు అగ్ని ప్రమాదానికి గురైంది. మత్స్యకారులు సముద్రంలో దూకి సురక్షితంగా ప్రాణాలతో ఒడ్డుకు చేరుకున్నారు. బాధిత మత్స్యకారులు మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. భోగాపురం మండలం ముక్కాం గ్రామానికి చెందిన గనగల్ల చిన్నయ్య బతుకుతెరువు కోసం 20 ఏళ్ల కిందట కుటుంబంతో కలిసి విశాఖపట్నం జిల్లా పూడిమరక వెళ్లాడు. అక్కడ సొంతంగా బోటును ఏర్పాటు చేసుకుని బంధువులతో కలిసి సముద్రంలో చేపలవేట చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం సముద్రంలోకి వెళ్లి చేపలవేట ముగించుకుని తిరిగి వస్తుండగా ప్రమాదవశాత్తు బోటులో మంటలు చెలరేగాయి. బోటులో ఉన్న ఏడుగురు మత్స్యకారులు సముద్రంలోకి దూకి ఈదుకుంటూ ఒడ్డుకు చేరి ప్రాణాలు కాపాడుకున్నారు. బోటు, వలలు కాలిపోవడంతో సుమారు రూ.30 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్టు మత్స్యశాఖ అధికారులు అంచనా వేశారు. విషయం తెలుసుకున్న గనగల్ల చిన్నయ్య బంధువులు ఘటనా స్థలానికి చేరుకుని పరామర్శించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

సాలూరు: పట్టణంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని ఎస్సై సీతారాం తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం, పట్టణంలోని లక్ష్మీథియేటర్, చిన్నిలాడ్జి ఎదురుగా ఉన్న ఖాళీ ప్రదేశంలో ఓ మృతదేహం ఉండడాన్ని అటువైపు బహిర్భూమికి వెళ్లిన వ్యక్తులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వగా, సంఘటనా స్థలానికి పోలీసులు వెళ్లి పరిశీలించారు. అనంతరం దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.